పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, జనవరి 10 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. సంక్రాంతి పండుగ సెలవుల సందర్భంగా బోథ్, పొచ్చెర, నేరడిగొండ, సొనాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి కొనుగోలు యథావిధిగా ఉంటాయని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

పాఠశాలను సందర్శించిన ఏజీఎం

పనులు నిలిచిపోయిన భవనాన్ని పరిశీలిస్తున్న ఏజీఎం

బోథ్, జనవరి 10: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బీ) గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలను శుక్రవారం నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అబ్దుల్ రౌఫ్, సెక్రెటరీయల్ ఆఫీసర్ జే నారాయణ సందర్శించారు. మన ఊరు – మన బడిలో భాగంగా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన భవనాన్ని పర్యవేక్షించారు. మిగతా నిధులు త్వరగా మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కడెం, జనవరి 10: నిర్మల్ జిల్లా కడెం మండలం లింగాపూర్ జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వాల్గొట్ కిషన్ అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బచ్చు వెంకటరమణ, ఉపాధ్యాయులు భూమేశ్వర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహా ప్రదర్శనను జయప్రదం చేయండి

నిర్మల్ అర్బన్, జనవరి 10 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన లక్ష డప్పులు, వేల గొంతుకలతో మహా ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్ అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే వర్గీకరణ అమలు తీసుకురాకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని రాజకీయంగా శాశ్వతంగా బొంద పెడుతామని అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న వివేక్ వెంకటస్వామి తన బుద్ధి మార్చుకుని వర్గీకరణపై తన నిజాయితీని చాటుకోవాలని అన్నారు. 7న చేపట్టే కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీనివాస్, నందకుమార్, రవి, బాబురావు, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

భైంసా, జనవరి 10 : ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ గోపినాథ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. కావున వాహనదారులు, పాదచారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

తానూర్, జనవరి 10 : నిర్మల్ జిల్లా తానూర్‌లోని రైతు వేదికలో శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అలాగే బెల్‌తరోడ గ్రామంలో రూ.47 లక్షలతో చెరువు మరమ్మతు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, హంగిర్గా సొసైటీ చైర్మన్ నారాయణ్‌రావుపటేల్, తహసీల్దార్ లింగమూర్తి, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు చిన్నరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్

భైంసా, జనవరి10 : నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ పిఫ్రి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసుకొని వచ్చిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో సుభాష్ మాట్లాడుతూ ఇంటి వద్ద తయారు చేసుకున్న వాటిని తినాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చందులాల్, మాటేగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రమణ రావు పాల్గొన్నారు.

అర్బన్ పార్కు సందర్శన

కోతుల పునరుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ముఖ్య అటవీ సంరక్షణ అధికారి సువర్ణ

సారంగాపూర్, జనవరి 10: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బీ) గ్రామంలోని అర్బన్ పార్కు, కోతుల పునరావాస, పునరుత్పత్తి నిరోధక కేంద్రాన్ని శుక్రవారం ముఖ్య అటవీ సంరక్షణ అధికారి సువర్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోతులకు నియంత్రణ ఆపరేషన్లు ప్రతి రోజూ చేయాలన్నారు. గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువ ఉన్నందున ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, నియంత్రణ ఆపరేషన్లు చేయాలన్నారు. అనంతరం ఇటీవల ప్రారంభించిన కోతుల పునరుత్పత్తి కేంద్రాన్ని, కోతుల కుంటుబ నియంత్రణ శస్త్ర చికిత్సను పర్యవేక్షించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మల్ అటవీ శాఖ సిబ్బంది రూపొందించిన చైనా మంజాను నివారిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం పోస్టర్ విడుదల చేశారు. ఇక్కడ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవానన్, జిల్లా అటవీ శాఖ అధికారి ఆదం నాగిని, ఫ్లయింగ్‌స్క్వాడ్ డివిజన్ అధికారి రవీందర్, ఎఫ్ఆర్‌వోలు రామకృష్ణ, వేణుగోపాల్, అనిత, అవినాశ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

ఎడ్‌బిడ్‌లో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ముథోల్, జనవరి 10 : మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సాప పండరి అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాల గురించి వివరించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులచే ర్యాలీగా తీశారు. ప్రజలకు మాదక ద్రవ్యాలపై చైతన్యం కల్పించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణ రావు పటేల్, భైంసా మండల వర్కింగ్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జైనథ్: మాట్లాడుతున్న పీఆర్‌వో కేసర్ సింగ్

జైనథ్, జనవరి 10: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నేషనల్ హైవే పీఆర్‌వో కేసర్ సింగ్ అన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పూసాయి గ్రామంలో వాహనదారులు, గ్రామస్తులకు అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, విఠల్, విద్యాసాగర్, ఏఈఈఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి, జనవరి 10 : రోడ్డు భద్రతా మసోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాంసిలోని జడ్పీ పాఠశాలలో ఎస్ఐ రాధిక విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు రోడ్డుపైన నడిచేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, పీడీ జక్కుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు

- వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు దొంగతనం
- గుట్టు ఛేదించిన పోలీసులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10 : జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించేందుకు వ్యవసాయ పరికరాలు చోరీ చేసే వృత్తిని ఎంచుకుని చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ మండలం ఎల్లపల్లి గ్రామానికి చెందిన దండుగుల రవి, శివరాత్రి రవి వారి స్నేహితులతో కలిసి సులభంగా డబ్బు సంపాదించి వాటితో జల్సాలు చేయాలనే పథకం చేశారు. ఈ క్రమంలో గత డిసెంబర్‌లో కొండాపూర్‌లో ఓ ఇంటి ముందున్న రోటవేటర్‌ను ఎవరు లేని సమయంలో దండుగుల రవి, శివరాత్రి రవి వారి బావ అయిన సాగర్‌తో కలిసి చోరీ చేసి ట్రాక్టర్‌లో తీసుకెళ్లి వేరే చోట దాచారు. డిసెంబర్ 29, 2024న దండుగుల రవి, శివరాత్రి రవి వారి బంధువులైన మాదాపూర్‌కు చెందిన ప్రవీణ్, సాయిలు సహాయంతో మాదాపూర్ గ్రామ శివారులోని రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలోని రోటవేటర్‌ను దొంగలించారు. దొంగలించిన రెండు రోటవేటర్లను ఆర్మూర్‌లో అమ్మేందుకు వెళ్తుండగా సోన్ పోలీసులు మాదాపూర్ సమీపంలో పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు రోటవేటర్లు, మహేంద్ర ట్రాక్టర్, ట్రాక్టర్ ట్రాలీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన శివరాత్రి రవి, దండుగుల రవి, దేశెట్టి ప్రవీణ్, కుంచపు సాయిలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సోన్ ఎస్ఐ గోపి, సోన్ సీఐ నవీన్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఎస్పీ డా. జానకిషర్మిల అభినందించారు.

ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కౌఠ(బీ) యువకుడు

యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వెండి సోమేశ్వర్

బోథ్, జనవరి 10: సౌత్ ఏషియా ఫీస్ కాన్ఫరెన్స్ ఇంటర్నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బీ) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌లో నిర్వహించిన సదస్సులో కరీంనగర్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. రాష్ట్రం తరపున ఫెస్టివల్‌లో 19 మంది యువకులు పాలు పంచుకున్నారు.

తెలంగాణ సాహిత్య సదస్సుకు కవి వెంకట్ ఎంపిక

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10 : తెలంగాణ సాహిత్య సదస్సుకు నిర్మల్‌కు చెందిన సంస్కృత భాష ప్రచార సమితి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు పద్యకవి బీ వెంకట్ ఎంపికయ్యారు. ఈ నెల 12న కామారెడ్డి జిల్లా చారిత్రక క్షేత్రం దోమకొండ కోట సంస్థానంలో దోమకొండ ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ సాహిత్య సమాలోచన సదస్సులో వెంకట్ పాల్గొననున్నారు.

దాడి ఘటనలో ముగ్గురికి మూడేళ్ల జైలు

భైంసా, జనవరి, 10 : దాడి ఘటనలో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూపాయలు వెయ్యి చొప్పున భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు జరిమానా విధించినట్లు కోర్టు డ్యూటీ అధికారి పాండు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని బోకర్ తాలూకా కడికి గ్రామానికి చెందిన మాధవ్, నితిన్, దుశ్శేవాడ్ చరణ్ 2018లో తానూర్ మండలం బెల్‌తరోడాలోని ఓ హోటల్‌లో అల్పాహారం, జిలేబీ తిన్నారు. యజమాని మనోజ్ డబ్బులు అడగగా దాడికి పాల్పడ్డారు. స్థానికులు జగదీశ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ నిందితులు అక్కడే ఉన్న వేడినూనె తీసుకొని మనోజ్, జగదీశ్‌పై పోశారు. ఈ కేసులో ఏపీపీ అరుణ ముగ్గురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, జనవరి 10: తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు ఇవ్వనున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు క్రిస్టియన్ మైనార్టీ మహిళలు ఆన్‌లైన్ టీజీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 55 సంవత్సరాల (వయసు ధ్రువీకరణ కోసం ఓటర్ ఐడీ కార్డ్/ఆధార్ కార్డ్), తెలంగాణ ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా నేర్చుకున్న టైలరింగ్ సర్టిఫికెట్, కనీసం 5వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు పైన పేర్కొనబడిన ధ్రువ పత్రాలను జత చేసి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆటోలోని గ్యాస్ బుడ్డి చోరీ

ఎదులాపురం, జనవరి 10 : ఆటోలో ఉన్న గ్యాస్ బుడ్డి చోరీ అయినట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన తాజ్‌మియా శుక్రవారం తన ఆటోలో గ్యాస్ బుడ్డి, ఫ్లెక్సీకి సంబంధించిన రోల్‌ను తీసుకెళ్తున్నాడు. అంబేద్కర్ చౌక్‌లోని నవదుర్గ ఫ్లెక్సీ షాపు లోపలికి వెళ్లి ఆ యజమానికి ఫ్లెక్సీ రోల్‌ను ఇచ్చి 15 నిమిషాల తర్వాత బయటకు వచ్చాడు. ఆటోలో ఉన్న గ్యాస్ బుడ్డి అక్కడ కనిపించలేదు. దీంతో వన్ టౌన్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒకరు రిమాండ్‌కు తరలింపు

ఇచ్చోడ, జనవరి 10 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నం గ్రామంలో అటవీ, పోలీస్ శాఖాధికారులకు విధి నిర్వహణను అడ్డుకొని దాడి చేసిన కేశవపట్నం గ్రామానికి చెందిన ఏ1 ముద్దాయి షేక్ జైనులీన్‌ను జేఎఫ్ఎం బోథ్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. ఈనెల 5వ తేదీన కేశవపట్నంలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు అటవీ, పోలీస్ శాఖాధికారులను అడ్డుకొని దాడి చేశారు. ఇందులో మొదటి ముద్దాయి షేక్ జైనులను కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

కాలేరి శేఖర్(ఫైల్)

బోథ్, జనవరి 10 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన కాలేరి శేఖర్(24) ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. రెండేళ్ల క్రితం శేఖర్‌కు నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కంఠం గ్రామానికి చెందిన సోనితో వివాహం జరిగింది. పెండ్లి అయిన నెల నుంచి భార్యభర్తల మధ్య తరచు గొడవ జరుగుతుండేది. ఆరు నెలల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా భర్యభర్తలు కలిసి కాపురం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మళ్లీ గొడవ జరగగా భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి చెందిన శేఖర్ శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలక్ట్రానిక్ దుకాణం దగ్ధం

కుభీర్, జనవరి 10: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని అన్నపూర్ణ ఎలక్ట్రానిక్స్ దుకాణం అగ్ని ప్రమాదానికి గురై కాలి బూడిదైంది. గురువారం రాత్రి 11 గంటలకు తాళం వేసి ఉన్న దుకాణం నుంచి మంటలు రావడంతో గమనించిన ఇరుగు పొరుగు వారు యజమాని గాజుల లింబాద్రికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న యజమాని తాళం తీసి షెట్టర్‌ను పైకి ఎత్తగా అప్పటికే మంటలు తీవ్రంగా అలుముకుని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతూ పేలిన శబ్దాలు రావడంతో భైంసా ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వాహనం వచ్చేటప్పటికే దుకాణం మొత్తం కాలిబూడిదైంది. రూ.లక్షల్లో ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఆర్ఐ గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

12న నిర్మల్‌లో యువజన దినోత్సవం

నిర్మల్ అర్బన్, జనవరి 10 : ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని డైరెక్టర్ ఆఫ్ యూత్ సర్వీస్, కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్‌లో యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నిర్మల్‌లోని వివేకానంద్ చౌక్‌లో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందని యువజన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రాయితీపై జొన్న విత్తనాలు

జొన్న విత్తనాల బ్యాగ్‌లు అందజేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి జాదవ్ కైలాస్

ఇచ్చోడ, జనవరి 10: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో రాయితీపై జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ విస్తరణాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో రైతులకు రాయితీపై జొన్న విత్తనాల బ్యాగ్‌లు అందజేశారు. సీఎస్‌వీ 50 కిలోల బ్యాగ్ రూ.250, పూలే సుచిత్ర 40 కిలోల బ్యాగ్ రూ.140 ఉందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సంజీవ్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బెల్టు, ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంఈవో సునీల్

ఇచ్చోడ, జనవరి 10: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సిరికొండ మండల విద్యాధికారి సునీల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సిరికొండలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి సునీల్ హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు బెల్టు, బెల్టు, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గంగారం, ఉపాధ్యాయులు, మాజీ కోఆప్షన్ మెంబర్ గుగ్లిల్ల స్వామి పాల్గొన్నారు.

పాడి గేదెలు అందజేత

తాంసి(భీంపూర్), జనవరి 10: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని రాజ్‌గడ్ ఎంపీ నగేశ్ సందర్శించారు. ఒక సంస్థ చేయూతతో 14 మంది మహిళా రైతులకు పాడి గేదెలు అందజేశారు. అలాగే భీంపూర్‌లో ఎంపీ వ్యవసాయ శాఖ జాతీయ ఆహార భద్రత మిషన్ కింద యాసంగి రైతులకు సబ్సిడీ జొన్న విత్తన సంచులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈవోలు శంకర్, మహేశ్, వికలా, సతీశ్, వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఉట్నూర్ రూరల్, జనవరి 10 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ వసంత్ ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు జగన్ నాయక్ ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ సొసైటీ సభ్యులు జాదవ్ శంకర్‌రావ్, జాదవ్ అజయ్ కుమార్, రాథోడ్ వసంత్, గణేశ్ పాటిల్ ఉన్నారు.

ప్రారంభమైన నాగోబా గంగాజల పాదయాత్ర

ఇంద్రవెల్లి, జనవరి 10: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఉత్సవాల్లో భాగంగా మెస్రం వంశీయుల గంగనీళ్ల కోసం శుక్రవారం బయలుదేరారు. పురాతన నాగోబా ఆలయం(మురాడి)లో మెస్రం వంశీయులు సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి నాగోబా మహాపూజకు ఉపయోగించే గంగాజల సేకరణ కోసం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. కేస్లాపూర్ నుంచి బయలుదేరిన మెస్రం వంశీయులు ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ జన్నారం మండలం హస్తినమడుగు వద్ద నుంచి గోదావరి పవిత్ర జలమును తీసుకొని రానున్నారు.

జాతర ఏర్పాట్ల పనులు మొదలు

కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్ల పనులను అధికారులు మొదలు చేశారు. తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు స్నానపు గదుల ఏర్పాట్లు, మర్రిచెట్ల ప్రాంతంతో పాటు గోవాడ్ ప్రాంతంలో పనులు చేపడుతున్నారు. ఈ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కుంటాల, జనవరి 10: నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్ స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వర్, చిన్నారెడ్డి, రమణ గౌడ్, లక్ష్మణ్ పటేల్, దశరథ్, రజనీకాంత్ పాల్గొన్నారు.

108లో ప్రసవం

కుభీర్, జనవరి 10: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం చాత గ్రామానికి చెందిన సంధ్య అనే గర్భిణీ పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది వాహనంతో అక్కడికి చేరుకున్నారు. సంధ్యను భైంసా దవాఖానకు తీసుకెళ్తుండగా పురిటి నొప్పులు అధికంకావడంతో గ్రహించిన ఈఎంటీ పూజారి లక్ష్మణ్ మార్గమధ్యంలో ప్రసవం చేశాడు. పండంటి ఆడ బిడ్డకు మహిళ జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు సూచించడంతో 108 సిబ్బంది పూజారి లక్ష్మణ్, పైలెట్ సుబేదార్‌ను అభినందించారు.

నష్టపరిహారం అందజేత

నష్టపరిహారం చెక్కులు అందజేస్తున్న అటవీ శాఖ అధికారులు

కుంటాల, జనవరి 10 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలా బీట్ పరిధిలో ఇటీవల పులి దాడిలో పశువులు మృతి చెందాయి. బాధిత రైతులు వినోద్, రాథోడ్ మారుతిలకు రూ. 15వేలు, రూ. 10 వేల చొప్పున అటవీ శాఖ అధికారులు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్ఎస్ఓలు కీర్తి, సంధ్య, ఎఫ్‌బీవోలు హరిలత, లెనిన్, కృష్ణ, మహేశ్వర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబురాలు

ఎదులాపురం/బోథ్/భీంపూర్/భైంసా/ముథోల్/కుంటాల/దస్తురాబాద్, జనవరి 10 : ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని వేదం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో, ఆదిలాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాల, కళాశాల,భీంపూర్ మండలం కరంజి(టీ) ప్రాథమిక పాఠశాల, నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గౌతమి పాఠశాల, శ్రీ సరస్వతి శిశుమందిర్ కోర్బగల్లి, ముథోల్‌లోని శ్రీ అక్షర, రబీంద్ర ,కుంటాల మండలం కల్లూరులోని వాసవి హైస్కూల్‌లో, దస్తురాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల ప్రాంగణమంతా విద్యార్థులు వేసిన రంగవల్లులు, గొబ్బెమ్మలతో సప్తవర్ణ శోభితంగా మారింది. విద్యార్థులు హరిదాసుల వేషధారణలో చేసిన కీర్తనలు, చిన్నారులను దీవించే కార్యక్రమం భోగిపళ్లు, భోగిమంటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంక్రాతి పండుగ యొక్క విశిష్టతను ప్రధానోపాధ